సాక్షి

# 1,100 నుంచి 900కు

## తగ్గిన ప్రభావిత ఆస్తులు

- పాతబస్తీ మెట్రో విస్తరణ
- అలైన్‌మెంట్‌లో మార్పు
- ఇప్పటికి 380 ఆస్తుల కూల్చివేత
- కొనసాగుతున్న మార్కింగ్

**సాక్షి, సిటీబ్యూరో:** పాతబస్తీ మెట్రో విస్తరణతో ప్రభావితమయ్యే ఆస్తుల సంఖ్య తగ్గింది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు సుమారు 7.5 కి. మీ మార్గంలో 1,100 ఆస్తులను సేకరించనున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ మొదట గుర్తించింది. తాజాగా ఇంజినీరింగ్ నైపుణ్యంతో ఎలైన్‌మెంట్‌ను సరిదిద్దడంతో సేకరించాల్సిన ఆస్తులు 900కు తగ్గినట్లు హెచ్‌ఏఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆస్తుల కూల్చివేత, రోడ్డు విస్తరణ, పిల్లర్స్ మార్కింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. పాతబస్తీ మెట్రోపై ఆదివారం సమీక్షించారు.

### 412 నిర్మాణాలకు పరిహారం..

ఆస్తుల సేకరణలో భాగంగా ఇప్పటి వరకు 412 నిర్మాణాలకు పరిహారం ప్రకటించారు. 380 ఆస్తులను కూల్చివేశారు. బాధితులకు రూ.360 కోట్ల పరిహారం చెల్లించారు. మెట్రో పనులకు సంబంధించి ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో ప్రతిరోజు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎన్వీఎస్ చెప్పారు.ప్రభావిత ఆస్తులను స్వాధీనం చేసుకుంటూ, కూల్చివేసిన శిథిలాలను తొలగించడంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. వాటిని అధిగమించి పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నట్లు చెప్పా రు. చాలాచోట్ల ఇళ్లు ఒకదానికొకటి ఆనుకుని ఉండటంతో కూల్చివేత పనులను జాగ్రత్తగా కొనసాగించాల్సి వస్తోందన్నారు. పైగా విద్యుత్ లైన్‌లు, ఇతర కేబుళ్ల తొలగింపు ఎంతో సంక్లిష్టంగా ఉందన్నారు. ప్రతి క్షణం అప్రమత్తతను పాటిస్తూ ముందుకెళ్తున్నట్లు ఎండీ పేర్కొన్నారు. మిగిలిన ఆస్తుల స్వాధీనానికి, త్వరితగతిన కూల్చివేతలు పూర్తిచేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు ఎన్వీఎస్ వెల్లడించారు.

### త్వరలో భూసామర్థ్య పరీక్షలు..

మెట్రో నిర్మాణ పనులను చేపట్టేందుకు అవసరమైన చర్యలను కూడా హెచ్‌ఏఎంఆర్ఎల్ ప్రారంభించింది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో కారిడార్‌లో ఏర్పాటు చేయనున్న పిల్లర్లకు తగిన స్థలాలను ఎంపిక చేసి మార్కింగ్ పనులను పూర్తి చేశారు. వయాడక్ట్‌లను నిలిపే పిల్లర్ల మధ్య 25 మీటర్ల (సుమారు 82 అడుగులు) దూరం ఉంటుందని మెట్రో ఎండీ చెప్పారు. మెట్రో స్తంభాలు, స్టేషన్లు వచ్చే ప్రదేశాల్లో భూసామర్థ్య పరీక్షల కోసం ప్రత్యేక ఏజెన్సీని నియమించినట్లు పేర్కొన్నారు. త్వరలో భూసామర్థ్య పరీక్షలను చేపట్టనున్నట్లు చెప్పారు. పిల్లర్లు, స్టేషన్లు ఏర్పాటు చేయనున్న ప్రాంతాల్లో భూగర్భ మురుగు నీటిపైపులైన్లు, మంచినీటి పైపులైన్లు, వరదనీటి డ్రైన్లు, పైన వేలాడే విద్యుత్ లైన్లను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ లైన్లను అండర్ గ్రౌండ్ లేబుళ్లుగా మార్చనున్నట్లు తెలిపారు. ఇందుకోసం వాటర్ బోర్డు, జీహెచ్ఎంసీ, టీజీఎస్పీడీసీఎల్ విభాగాల నుంచి అంచనాలు సమర్పించాల్సిందిగా కోరినట్లు చెప్పారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్ర స్థాయిలో పనులను కొనసాగిస్తున్నట్లు ఎన్వీఎస్ వివరించారు.


కొనసాగుతున్న ఆస్తుల కూల్చివేత